క్లుప్తంగా

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల ఏ, బీ కేంద్రాలను, కస్తూరిబా గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి పి.రమేష్ గురువారం తనిఖీ చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులు పరీక్షలు రాస్తుండటంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పరీక్షలను కూడా సజావుగా నిర్వహించాలని పరీక్షల చీఫ్‌లకు డీఈఓ సూచించారు.

లేబర్ ఆఫీసర్‌గా భూపాల్

మార్కాపురం: మార్కాపురం సహాయ కార్మిక శాఖ అధికారిగా ఎం.భూపాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులోని ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు తమ పేర్లను కార్మిక శాఖ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని, గతంలో నమోదు చేయించుకున్న వారు రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

కొనకనమిట్ల: మండల తహసీల్దార్‌గా కె.ప్రవీణ్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పని చేసిన కేవీఆర్‌వీ ప్రసాదరావును పలు ఆరోపనలపై విధుల నుంచి తొలగించారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనను కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలి

పెద్దదోర్నాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 17 రకాల లక్ష్యాలు ఏర్పాటు చేశాయని ఎంపీడీఓ నాసర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో గ్రామ సచివాలయ అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్యంగా బడి ఈడు చిన్నారులు 100 శాతం బడికి వెళ్లే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఎంఈఓ, మస్తాన్ నాయక్, మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్, వైఎస్సార్ సీపీ కేపీ ఏపీఎం. పోలయ్య, మండల పరిధిలోని గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ సచివాలయాల వీఆర్వోలు పాల్గొన్నారు.

పెయ్య దూడల పోషణపై ప్రత్యేక దృష్టి



లవణ మిశ్రమం అందిస్తున్న శ్రీనివాసరావు

దర్శి: పెయ్య దూడల పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొట్లపాలెంలో పెయ్యదూడల పోషణ, పిండ మార్పిడి పథకం కార్యక్రమంలో భాగంగా 10 పాడి గేదెలకు చూడి కావించడం చేశారు. గేదెలకు కావాల్సిన ఖనిజ లవణ మిశ్రమాన్ని పశువైద్య సిబ్బంది అందజేశారు. డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ ఎస్‌కే కాలేషా, సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరెడ్డి, పశు వైద్యాధికారులు ప్రతాప్‌రెడ్డి, రాంబాబు, బసవయ్య, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కృత్రిమ పిండధారణ మేలైన పశు సంపద

తాళ్లూరు: మేలైన పశుసంపద సృష్టికి కృత్రిమ పిండధారణ(ఈ.టీ.టి) విధానం ఎంతో మేలైనదని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కృత్రిమ పిండిధారణతో మేలైన పశుసంపద సృష్టికి తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర సీఈఓ గురువారం తాళ్లూరు మండలంలో పరిశీలించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి షేక్ కాలేషా మాట్లాడుతూ.. ఎమ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ (ఈ.జి.జి) ద్వారా రెండేళ్లలో మేలైన జాతి పశువులు ఉత్పత్తి అవుతాయని చెప్పారు. రైతులకు ప్రోత్సాహకంగా రూ.2500 విలువైన దాణాను అందించారు. దర్శి, చీమకుర్తి ఏడీలు డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ వెంకటరెడ్డి, తూర్పుగంగవరం, తాళ్లూరు పశువైద్యాధికారులు డాక్టర్ ఎం.రాంబాబు, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశానికే రోల్ మోడల్..ఫ్యామిలీ డాక్టర్



దర్శి: రోగులను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగకుండా డాక్టర్‌లే మీ గ్రామానికి, మీ ఇంటికి వచ్చి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని బొట్లపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా 104 వాహనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. 104లో ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బొట్లపాలెంలోని పోలంరెడ్డి నాగేంద్రానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.3 లక్షల చెక్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లినా వైద్యులు లేక వైద్యం కోసం పడిగాపులు కాసి వెనుదిరిగే పరిస్థితులు ఉన్నాయన్నారు. నేడు ప్రతి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో 14 రకాల టెస్ట్‌లు, 105 రకాల మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వైద్యులు బి.కిరణ్మయి, డాక్టర్ పి.స్పందన, 104 వెహికల్ డీఈఓ, ఎంపీపీ సుధాఅచ్చయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య, కౌన్సిలర్ వీసీ రెడ్డి, యలమందారెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని తంబళ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని స్థానిక ఎంపీపీ కడప లక్ష్మీ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెరుగైన వైద్య సేవలను వారి ఇంటి వద్దకే తీసుకురావాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 67 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. కెఎస్‌పల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి నాయబ్ రసూల్, సంజీవరాయుడుపేట వైద్యాధికారి సుమయా, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పల్లె పల్లెలో వైద్య సేవలు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో గురువారం పారంభించారు. సర్పంచ్ చిత్తూరి హారిక, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, ప్రభుత్వ వైద్యులు శంకర్‌రెడ్డి, సాయి ప్రశాంతి, ఎంఎల్‌హెచ్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, కృపాచారి, బ్రహ్మాచారి, వసుంధరదేవి, మోహన్‌రావు, వైఎస్సార్ కేపీ ఏపీఎం, పోలయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని విశ్వనాథపురంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లో భాగంగా 104 నూతన వాహనాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ శాషం మాధవీలత, ఎంపీటీసీ ముసలయ్య, వైద్యాధికారులు శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ శింగారెడ్డి పోలిరెడ్డి, కో కన్వీనర్ సీహెచ్ యల్లారెడ్డి, పార్టీ సాయకులు శేషం రంగబాబు, గుడిమెట్ల గాలెయ్య పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని మీర్జాపేట సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. డాక్టర్ల సేవలను ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రావణి, కాశయ్య, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం



పొదిలిలో ఎమ్మెల్యే కేపీని సత్కరిస్తున్న డ్వాక్రా మహిళలు

- స్వయం సహాయక సంఘాల మహిళలకు వరం వైఎస్సార్ ఆసరా పథకం
- మూడో విడత చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కొనకనమిట్లలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ

పొదిలి రూరల్/కొనకనమిట్ల: రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా, ఆడపడుచుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహిస్తూ పాలన సాగిస్తున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం కొనకనమిట్లలోని కళ్యాణ మండపంలో, సాయంత్రం పొదిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

పొదిలిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి పొదుపు సంఘాలు తీసుకున్న రుణాన్ని నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు మూడు విడతల్లో నగదు అందించారన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. పొదిలి మండలంలో 1065 గ్రూపులకు మూడో విడతలో రూ.8,06,73,635 నగదు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించి రుణం తీర్చుకోవాలని పొదుపు సంఘాల మహిళలను కోరారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేను డ్వాక్రా మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, నగర పంచాయతీ కమిషనర్ జోసఫ్ డానియల్ , ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, ఈవో ఆర్డీ రాజశేఖర్, ఏపీఎం మాణిక్యారావు, వైఎస్సార్ సీపీ నేతలు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, సాయి రాజేశ్వరరావు, కె.నరసింహరావు, కొత్తపులి బ్రహ్మారెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జూపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్లలో ఎమ్మెల్యే మాట్లాడుతై.. జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరవేరుస్తూ మహిళల సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ముందుగా ఏపీఎం కర్నాటి గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాల కేక్ కట్ చేశారు. అనంతరం 846 డ్వాక్రా గ్రూపులకు రూ.7.67 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేసి సంతోషాన్ని వెలబుచ్చారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫా, పార్టీ నేతలు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల రామనారాయణరెడ్డి, మోరా శంకర్‌రెడ్డి, సర్పంచ్ శిగినం లక్ష్మి తిరుపతమ్మ, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, సూరవరపు పెదవెంకటరెడ్డి, చిరుగూరి కోటేశ్వరరావు పావులూరి వెంకటేశ్వర్లు, బాలచంద్రుడు పాల్గొన్నారు.

జనం కోసమే..జగనన్న!

- ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



ప్రజల సమస్యలపై తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

కురిచేడు: జనం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్విరామంగా కష్టపడుతున్నారని, ఆయన్ను జనం ఆదరించాలని దర్శి శాసనసభ్యుడు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కోరారు. మండలంలోని కురిచేడు-2 సచివాలయం పరిధి పేరంబొట్లపాలెం, కాటంవారిపల్లెలో ఆయన గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని, ప్రజల కోసం గతంలో ఏ ప్రభుత్వమూ చేయనంతగా ప్రజల వద్దకే అధికారులను పంపి అనేక సర్వీసులు అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రిదేనన్నారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ఆయన ప్రతి ఇంటి వద్ద ప్రస్తావించారు. అంతే కాకుండా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ షేక్ సైదా, మండల సచివాలయాల కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, దర్శి ఏఎంసీ వైస్ చైర్మన్ కె.నాగేశ్వరరావు, ఎంపీటీసీలు బుల్లం వెంకట నర్సయ్య, కానాల శివారెడ్డి, కురిచేడు మాజీ సర్పంచ్ పోలిరెడ్డి నాగిరెడ్డి, కురిచేడు సొసైటీ ప్రెసిడెంట్ మర్రి సుబ్రహ్మణ్యం, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మార్కాపురం: ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కోర్టు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ కూలింగ్ వాటర్ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, ట్రస్ట్ ఫౌండర్ ఉస్మాన్‌బేగ్, షమ్స్ ఉలు ఉలుమ్ బీఈడీ కాలేజీ చైర్మన్ జాఫర్ అలీబేగ్, ఇండ్ల ఫౌండేషన్ చైర్మన్ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బూచేపల్లి జన్మదిన వేడుకలు



దర్శిలో కేక్ తినిపించుకుంటున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అభిమానులు

దర్శి: మండలంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గడియారం స్తంభం సెంటర్‌లో భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పట్టణంలోని గాంధీ నగర్‌తో పాటు పలు గ్రామాల్లో పుట్టిన రోజు కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గడియారం స్తంభం సెంటర్‌లో అన్నదానం చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. పలువురు నాయకులు భారీ సంఖ్యలో చీమకుర్తి వెళ్లి శివప్రసాద్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్యవిభాగం రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, వైఎస్సార్ సీపీ నాయకులు ఇరుగుల శ్రీనివాసరెడ్డి, చింతలపూడి శ్రీనివాసరెడ్డి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

బేస్తవారిపేట: వేసవికాలంలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చాట్ల దానియేలు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీస్ రాష్ట్ర, జిల్లా నాయకులు చాట్ల జాన్, సురేష్, ప్రవీణ్, పోలమ్మ, సృజన్, పుల్లయ్య పాల్గొన్నారు.

నాటి పాలన కంటే.. నేటి పాలన భేష్

- కరపత్రాలు విడుదల చేసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

దర్శి: గత ప్రభుత్వ పాలన కంటే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పాలన బాగుందని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. సచివాలయ కన్వీనర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి తమ దృష్టికి తీసుకు రావాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంతో నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్‌లు, ముఖ్యనాయకులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగనన్న వాల్ పోస్టర్‌లను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ పాలన ఎలా ఉంది..? గత టీడీపీ పాలన ఎలా ఉందో ఒకసారి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. గురువారం 16, 17వ వార్డులో పార్టీ కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించి కిట్లు, స్టిక్కర్లు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హర్షిత, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాగా ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు దొడ్డా భాగ్యలక్ష్మి, నగేష్, బుశెట్టి నాగేశ్వరరావు, గుంటక వనజాక్షి, కరీం బాషా, షేక్ ఖుర్షీద్, హబీబుల్లా తదితరులు వార్డుల్లో సమావేశాలు నిర్వహించారు.

'రైతు భరోసా' దరఖాస్తుకు అవకాశం

దొనకొండ/గిద్దలూరు రూరల్: గ్రామాల్లో నేటికీ రైతు భరోసా పొందని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు మండల దొనకొండ, గిద్దలూరు వ్యవసాయాధికారులు ఎస్.లక్ష్మీనారాయణ, ఏఓ విజయభాస్కర్‌రెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆర్‌బీకేలో సిబ్బందిని సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో చైర్మన్ చిన్న ఓబులేసు

రాచర్ల: మండలంలోని జేపీ చేరువులో నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజల అనంతరం గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు పూలు చల్లుకుంటూ రంగస్వామి వారి శ్లోకాలు జపిస్తూ నల్లమల అడవుల్లో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం వరకు ప్రత్యేక వాహనంలో ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లారు. దేవస్థానం చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు, కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారి శ్రీనివాస్‌బాబు, చినగానిపల్లె సర్పంచ్ పగడాల రమేష్ పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన వివాహిత పోకూరి లక్ష్మి(28) అనుమానాస్పద మృతిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోకూరి ప్రభు తన భార్య లక్ష్మితో కలిసి తిరుపతి జిల్లా శ్రీసిటీ వద్ద బేల్దారి పనులకు వెళ్లారు. వీరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో కుటుంబ పెద్దలు సర్దిచెప్పారు. ఈ నెల నాలుగో తేదీన శ్రీసిటీ వద్ద అద్దెకు ఉంటున్న ఇంట్లో లక్ష్మి ఉరివేసుకొని మృతి చెందడంతో మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యులు కర్నూలు జిల్లా ఆదోని నుంచి గురువారం మారెళ్లకు చేరుకున్నారు. లక్ష్మి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలి తండ్రి చిన వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జగనన్న ప్రభుత్వంలో సంతోషంగా ప్రజలు

తర్లుపాడు: జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే వస్తుండటంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాగసముద్రం గ్రామంలో బుధవారం శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన వైఎస్సార్ స్టేజీపై ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు పదవుల్లో కూడా వారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించారన్నారు. 4 ఏళ్లలో నూరు శాతం హామీలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, పార్టీ అధ్యక్షులు మురారి, వెలుగొండ టెంపుల్ చైర్మెన్ తిరుపతిరెడ్డి, సర్పంచ్ రమణారెడ్డి, వైస్ సర్పంచ్ శాంతరావు, నాయకులు మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ వృద్ధురాలు మార్కాపురం వాసి

కంభం: బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన వృద్ధురాలిని మార్కాపురం వాసిగా పోలీసులు గుర్తించారు. మార్కాపురం పూలసుబ్బయ్య కాలనీకి చెందిన షేక్ ఖాసింబీ(68) బుధవారం పల్లపాటి చెన్నకేశవులు బైక్‌పై మార్కాపురం వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఆమె మృతి చెందింది.